నమస్తే తెలంగాణ
నిజామాబాద్
3 | నిజామాబాద్, శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | NIZAMABAD

# వరికి రూ.500 బోనస్ ఇవ్వాలి..

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 25: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు వరి ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ వచ్చి కొనుగోలు చేయాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. కాంటా వేసిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసిందని అన్నారు. రైతులు పండించిన పంటను సగం వ్యాపారులు కొనుగోలు చేసిన తర్వాత గానీ కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ లేదన్నారు. కాంటా జరిగి రోజులు గడుస్తున్నా రైతులకు డబ్బులు అందడం లేదంటూ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రానికి పోచారం వచ్చినట్లు తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా ఆయన వద్దకు చేరుకున్నారు. వారు పడుతున్న ఇబ్బందులను పోచారం దృష్టికి తీసుకెళ్లారు. అకాల వర్షాలకు నేలకొరిగిన పంట విషయంలో ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదని, కొనుగోలు కేంద్రాలను కూడా సరిగ్గా ఏర్పాటు చేయడంలేదని రైతులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు ప్రభుత్వాన్ని నిలదీసే రోజులు చాలా దగ్గరలో ఉన్నాయని పోచారం హెచ్చరించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి



రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన గిరిజనులు



నాగిరెడ్డిపేటలో ప్రసంగిస్తున్న మాజీ స్పీకర్, పోచారం. పక్కన జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

# బెదిరింపులతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్

- ప్రజలను మోసం చేసిన హస్తం పార్టీకి ఓటుతోనే బుద్ధి చెప్పండి
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- నాగిరెడ్డి పేట, లింగంపేటలో ఎన్నికల ప్రచారం
- హాజరైన జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జాజాల

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 25: అబద్ధాలు, మోస పూరిత ప్రకటనలు, ఇతర పార్టీల నాయకులను బెదిరింపులతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నాగిరెడ్డిపేట, లింగంపేటలో జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి గురువారం సాయంత్రం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతోపాటు వందలాది హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు వాటిని అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, పింఛన్ పెంపు, మహిళలకు రూ.2,500, నిరుద్యోగభృతి వంటి హామీలను గాలికి వదిలేసిందన్నారు. నిరంతర విద్యుతు సరఫరా లేక పోవడంతో పంటలు దెబ్బతిని వేలాది మంది రైతులు నష్టపోయారని తెలిపారు. రైతుల, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో లేకుండా చేయాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

**ఆశీర్వదించండి : అనిల్ కుమార్**

తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంటులో కొట్లాడాలంటే కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. మన రాష్ట్ర హక్కుల కోసం తాను పోరాటం చేస్తానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు.

**మదన్‌మోహన్ ఓ వసూల్ రాజా: జాజాల సురేందర్**

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఓ వసూల్ రాజాలా వ్యవహరిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. నియోజక వర్గంలో కనిపించకుండా, ప్రజలకు అందుబాటులో లేకుండా కార్పొరేట్ రాజకీయం చేస్తున్నాడని అన్నారు. క్వారీల నుంచి రూ.కోట్లు డిమాండ్ చేస్తున్నాడని, కొంత మంది నుంచి పెద్దమొత్తం డబ్బులు వసూలు చేశారని తెలిసిందని ఆరోపించారు. ప్రజల కోసం కాకుండా తన వ్యాపార పనుల కోసమే ఎక్కువ సమయంలో కేటాయిస్తున్నారని మండిపడ్డారు.


# కాకతీయ 2024 ఇంటర్ ఫలితాలలో, 2024 ఐఐటి-జెఇఇ మెయిన్స్ ఫలితాలలోను రెండింటిలో సూపర్ సక్సెస్

నిజామాబాద్ : ప్రస్తుత జాతీయ విద్యను దృష్టిలో ఉంచుకొని విద్యార్థి ఐఐటి/ మెడికల్ జాతీయ పరీక్షలో రాణించినప్పుడే పరిపూర్ణమైన విద్యార్థిగా మారుతాడు. ఐఐటి మెయిన్స్‌లో మంచి %టైల్ మరియు జాతీయ ర్యాంకులు రాకుండా ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో టాప్ మార్కులు వచ్చిన ప్రయోజనం శూన్యం. అందుకే కాకతీయ ఇంటర్‌లో మార్కులు మరియు ఆ విద్యార్థి జెఇఇ మెయిన్స్‌లో సాధించిన %టైల్ & ఆల్ ఇండియా ర్యాంకులు మరియు ఇంటర్‌లో సాధించిన మార్కులు స్పష్టంగా ఇస్తున్నాం. ఈ సందర్భంగా కాకతీయ డైరెక్టర్ రామోజీరావు (ఐఐటియన్) తమ విద్యార్థులు సాధించిన ఇంటర్ మార్కులు మరియు జెఇఇ మెయిన్స్ %టైల్ & ఆల్ ఇండియా ర్యాంకులు వివరణాత్మకంగా తెలియజేస్తూ....



కేతన 1220 ర్యాంకర్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ సి.హెచ్.రామోజీరావు ఐఐటియన్



మినాజ్
జెఇఇ మెయిన్స్:99.68%టైల్
జెఇఇ మెయిన్స్ ర్యాంక్:1051
ఇంటర్ మార్కులు:934



సుప్రీత్
జెఇఇ మెయిన్స్:99.41%టైల్
జెఇఇ మెయిన్స్ ర్యాంక్:2092
ఇంటర్ మార్కులు:965



శివప్రథమ్
జెఇఇ మెయిన్స్:99.22%టైల్
జెఇఇ మెయిన్స్ ర్యాంక్:2910
ఇంటర్ మార్కులు:987



ఎ మలిక్
జెఇఇ మెయిన్స్:98.30%టైల్
జెఇఇ మెయిన్స్ ర్యాంక్:7167
ఇంటర్ మార్కులు:974



ఎ హది
జెఇఇ మెయిన్స్:98.22%టైల్
జెఇఇ మెయిన్స్ ర్యాంక్:7533
ఇంటర్ మార్కులు:958




25-04-2024 న విడుదలైన 2024 ఐఐటి/జెఇఇ మెయిన్స్ ఫలితాలలో ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయి ఆల్‌ఇండియా ర్యాంకులతో పాటు 90% టైల్ పైగా సాధించిన 17 మంది కాకతీయ విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ రిటైర్డ్ అధికారి శ్రీ రఘురాజ్, డైరెక్టర్లు రామోజీరావు, రాజ మరియు ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్, స్టాఫ్



తేజస్విని 967 ర్యాంకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సందీప్ కులకర్ణి

అదే విధంగా ఐఐటి–జెఇఇ మెయిన్స్ 2024 ఫలితాలలో 99.68, 99.42, 99.22, 98.30, 98.22, 97.41, 97.01, 94.65, 94.51, 94.48, 93.95, 93.50, 93.34, 92.39, 91.63, 91.05, 90.48 ఇలా 90% టైల్ పైన 25-04-2024 న విడుదలైన ఐఐటి–జెఇఇ మెయిన్స్ 2024 ఫలితాలలో 17 మంది కాకతీయ విద్యార్థులు ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంకులను సాధించడమే కాకుండా 50 మంది కాకతీయ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యంత క్లిష్టతరమైన ఐఐటి అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము.

Advt.

చేంగల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో కాంగ్రెస్ గ్యారెంటీలపై ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

# గ్యారెంటీలను ఇచ్చేదాకా వదలం

- కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- అర్వింద్ 'బోర్డు' పేరుతో మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు..
- ప్రశ్నించే గొంతు బాజిరెడ్డిని గెలిపించుకుందాం..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్/ భీమ్‌గల్, ఏప్రిల్ 25: గత అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన ముప్కాల్ మండలంలోని నాగంపేట, నల్లూర్‌తోపాటు భీమ్‌గల్ మండలం చేంగల్,బడా భీమ్‌గల్ గ్రామాల్లో నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగంపేట్‌లో పంచాయతీ ఆవరణలో ఓ చెట్టుకింద కూర్చొని రైతులతో ముచ్చటించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పనులు కొనసాగే ప్రదేశానికి వెళ్లి కూలీలతో భేటీ అయ్యారు. సాయంత్రం భీమ్‌గల్ మండలం చేంగల్, బడా భీమ్‌గల్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. కల్లబొల్లి మాటలు, ఆరు గ్యారెంటీలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఒకే హామీని నెరవేర్చిందన్నారు. మిగతా ఐదు గ్యారెంటీలను త్వరలో తప్పక అమలుచేస్తామంటూ నమ్మిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు మళ్లీ ఏ ముఖం పెట్టుకొని లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుబీమా, రుణ మాఫీ, పెట్టుబడి సాయం, మహిళలకు పెన్షన్, వరికి బోనస్ ఇవ్వకుండా నాలుగు నెలలుగా రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు ఆగస్టు 15న అంటూ కొత్త డ్రామాకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గెలిచిన ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన ధర్మపురి అర్వింద్ మళ్లీ బోర్డుపేరుతో మోసం చేయడానికి వస్తున్నాడని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నించే గొంతుక, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ ముప్కాల్, భీమ్‌గల్ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, నర్సయ్య, సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి, గంగాధర్, సత్యనారాయణ, శ్రీనివాస్, భీమ్‌గల్ ఎంపీపీ మహేశ్, జడ్పీటీసీ రవి, విండో చైర్మన్ నర్సయ్య, జిల్లా నాయకులు కన్నె సురేందర్, మండల నాయకులు శర్యా నాయక్, తుక్కాజి నాయక్, సర్పంచులు సంజీవ్, గంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



నల్లూర్‌లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న వేముల

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్. వేదికపై విద్యాసాగర్‌రావు, జీవన్‌రెడ్డి, విఠల్‌రావు, ఆయేషా తదితరులు

- ఆరు గ్యారెంటీలను అమలుచేయని రేవంత్ సర్కార్
- నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- ఆర్మూర్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం
- హాజరైన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 25: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను గడప గడపకూ వివరించాలని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ..కార్యకర్తలకు సూచించారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించనున్నదని, ఇప్పటికే గులాబీ పార్టీకి ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ తిరుమల గార్డెన్‌లో గురువారం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డితో కలిసి బాజిరెడ్డి హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిందన్నారు. ఆరు గ్యారంటీల పేర్లతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు అమలుచేయడం లేదని మండిపడ్డారు. ఆ పథకాలను అమలుచేయలేక సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్లపై ఒట్టు వేసే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వచ్చిందని అంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి కేసీఆర్ పాలనలో జరిగిందని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, ఆర్మూర్ జడ్పీటీసీ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు

# తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి
- వెలవెలబోయిన బీజేపీ బహిరంగ సభ



ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 25: తెలంగాణలో తప్పుడు వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో గురువారం నిర్వహించిన బీజేపీ బహిరంగసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కనుమరుగైపోతుందన్నారు. దేశంలో జరిగిన అనేక కుంభకోణాల్లో ఆ పార్టీ హస్తం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులు పండించే పంటపై సైతం పన్ను విధిస్తుందన్నారు. సభలో ఎంపీ అర్వింద్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్, ఉత్తరాఖండ్ మంత్రి విజయ్ రోహిలా, నాయకులు పాల్గొన్నారు.

**ఖాళీ కుర్చీలు దర్శనం..**

సీఎం పుష్కర్ సింగ్ ధామి ప్రసంగిస్తున్న సమయంలో సభా ప్రాంగణంలోని వెనుకభాగం పూర్తిగా ఖాళీ అయ్యింది. 12.30 గంటలు దాటినా నేతలురాకపోవడంతో జనాలు పడిగాపులు కాశారు. సీఎం ప్రసంగం మొదలయ్యేసరికి జనాలు వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

# 42 మంది అభ్యర్థులు.. 90 నామినేషన్లు

- ముసిగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- నేడు పరిశీలన.. 29 వరకు ఉపసంహరణకు గడువు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నిజామాబాద్ నియోజకవర్గానికి మొత్తం 42 మంది 90 నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజైన గురువారం 28 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కలిపి బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నాలుగు సెట్లు, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ నాలుగు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఒక సెట్ నామినేషన్ వేశారు. నేడు (శుక్రవారం) నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. ఈ నెల 29 వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. అదేరోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. పోలింగ్ మే 13న, కౌంటింగ్ జూన్ 4న చేపట్టనున్నారు.

## జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి 27 మంది..

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో మొత్తం 27 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వివిధ పార్టీల నుంచి 12 మంది, 15 మంది స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లను అందజేశారు. బీఆర్ఎస్ తరపున గాలి అనిల్ కుమార్, కాంగ్రెస్ నుంచి సురేశ్‌కుమార్ షెట్కార్, బీజేపీ తరపున బీబీ పాటిల్ పోటీలో ఉన్నారు. నేడు (శుక్రవారం) నామినేషన్లను పరిశీలించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి తెలిపారు.